విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

12వ పీఆర్‌సీని అమలు చేయాలి

- ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, తిమ్మన్న డిమాండ్
- త్వరలోనే ప్రభుత్వంపై ఉద్యోగస్తుల తిరుగుబాటు : ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలో వున్న 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్‌లకు జులై ఒకటి 2023 నుండి 12వ వేతన సవరణ అమలు చేయాలని, 11వ వేతన సవరణలో జరిగిన అసంబద్ధ ఆర్థిక నష్టాన్ని భర్తీ చేయాలనీ ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన లంకల పల్లి సాయి శ్రీనివాస్, కార్యదర్శి హెచ్ తిమ్మన్న డిమాండ్ చేసారు. ఆదివారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో కాకినాడ జిల్లా శాఖ వార్షిక కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.కాశీ విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ గత సంవత్సరం కాలంగా పెండింగులో వున్న వేతన సవరణ బకాయిలు, కరువుభత్యం భవిష్యనిధి జీవిత భీమా చెల్లిపు బకాయిలు సంబంధిత సెలవు నాగాధికారణ మెడికల్ చెల్లింపులు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేసారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా కాంట్రిబ్యూటీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి 2004 నుండి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని అయన డిమాండ్ చేసారు. ప్రభుత్వం విలీనం చేసిన తక్షణం హెడ్ మాస్టర్‌లకు, డ్రాయింగ్ అధికారులకు, భవిష్య నిధి సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చెసారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు భయంగా జీవిస్తున్నారని అన్నారు. ప్రతి దానికి మెమోలు ఇస్తున్నారన్నారు. కరువు భత్యం ఇవ్వడానికి ప్రభుత్వం పిల్లి మొగ్గలు వేస్తోందని అన్నారు జీవిత బీమా డబ్బులను సంక్షేమ పథకాలకు ఖర్చుచేయ డం దారుణం అన్నారు. త్వరలోనే ఉద్యోగస్తులు ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తారని మధు అన్నారు. ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉపాధ్యాయుల సత్తా ఏమిటో చూపిద్దామని అన్నారు. జాతీయ విద్యావిధానం పేరుతో 345 తరగతుల విలీన ప్రక్రియ ఆపాలని అయన డిమాండ్ చేసారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దొరబాబు, సీని యర్ నాయకులు వెంకటరావు, నాయుడు కెవి శేఖర్, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామకృష్ణ, దానియల్ బాబు, జెకె శేఖర్, కృష్ణం రాజు, సంపత్ కుమార్, డి. కిరణ్మయి, పద్మావతి జాకబ్, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం వాటా విడుదల చేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమ రైల్వే లైన్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను, మ్యాచింగ్ గ్రాంట్‌ను 2023 బడ్జెట్‌లో కనీసం వంద కోట్లు కేటాయించాలని విద్యార్థి జెఏసి చైర్మన్ కరాటం ప్రవీణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సివి రామన్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. పోస్ట్ కార్డు ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ డిమాండ్లును సిఎంకి పంపించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవణం వేణు, యువ రైల్వే సాధన సమితి అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధ కొండ, కొత్తపల్లి వంశీ, చోడే జాన్ పాల్, యాలంగి వరప్రసాద్, సిహెచ్ సంసొన్, జాంగా రాజేంద్ర, కుడిపూడి రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీ సలహాదారుగా జర్నలిస్ట్ దుర్గ నియామకం

విశాలాంధ్ర - అమలాపురం : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) సలహాదారుగా సీనియర్ జర్నలిస్ట్ అడపా నాగదుర్గారావు (దుర్గ) నియమితులయ్యారు. ఇటీవల ఎస్వీబీసీ బోర్డు తీసుకొన్న నిర్ణయం మేరకు సీఇవో షణ్ముఖ కుమార్ ఈ ఉత్తర్వులు జారీ చేసారు. ఏడాది కాలం ఈ పదవిలో ఆయన కొనసాగబోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాత్రేనికోనకు చెందిన దుర్గ రెండున్నర దశాబ్దాలకు పైగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వివిధ హెూదాల్లో పనిచేసారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా, కాలమిస్ట్‌గా పనిచేస్తున్న ఆయన తెలుగు రాష్ట్రాల్లో పెద్దఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేద విద్యార్థులకు ఆదుకొనే శ్రీకృష్ణ దేవరాయ ఛారిటబుల్ ట్రస్ట్‌కు, కేపీహెచ్‌బీ శ్రీ షిర్డిసాయి బాబా దేవాలయాలకు గౌరవ సలహాదారుగా కొనసాగుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కలియుగ వైకుంఠనాధుని భక్తులకు ఎస్వీబీసీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని దుర్గ అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఎస్వీబీసీ ఛానల్ అడ్వైజర్‌గా తనను నియమించి స్వామి వారి సేవకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఛానల్ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, బోర్డు సభ్యులకు దుర్గ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభ శ్రీనుకు మాతృవియోగం

విశాలాంధ్ర - అనపర్తి : సీనియర్ పాత్రికేయులు, బిజేయు నాయకులు సత్తి శ్రీనివాసరెడ్డి (ప్రభ శ్రీను) తల్లి సత్తి గంగయ్యమ్మ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. గృహిణిగా బంధుమిత్ర, వర్గాలతో ఆమె ఎంతో కలుపుగోలి తనముతో సన్నిహితంగా ఉండే వారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గంగయ్యమ్మ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సానుభూతి తెలిపిన వారిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు కర్రి రామన్న తాత, అనపర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సత్తి వెంకట రెడ్డి, కార్యవర్గ సభ్యులు, సత్తి కాటవరెడ్డి, సత్తి సత్తి రెడ్డి తదితరులు ఉన్నారు.

నల్లూరులో వైభవంగా పోలేరమ్మ జాతర మహెూత్సవం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామంలో కొలువై వున్న గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహెూత్సవం ఆదివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి గరగ నృత్యాలు, శక్తి వేషదారణ, విచిత్ర వేష ధారణలతో, భాజా భజంత్రీలతో, బాణాసంచా కాల్పులతో వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జాము నుండి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ రాంబాబు, పుట్ట కృష్ణబాబు, వైయస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పుసబ్బు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు నియోజక వర్గం, కొవ్వూరు టౌన్‌లో 9 వ వార్డులో ఇదేం కర్మ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి , కంటమణి రామకృష్ణ లు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతుందని విమర్శించారు. టౌన్ అధ్యక్షులు రామకృష్ణ, 21 వ వార్డు మాజీ కౌన్సిలర్ పొట్రు శ్రీనివాస్, వార్డు ప్రెసిడెంట్ నగేష్, క్లస్టర్ ఇన్‌చార్జిలు శ్రీను, పిసుమాక జయరాజు , కొవ్వూరు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు గల్లా సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సుకై భద్రాచలం రథయాత్ర

విశాలాంధ్ర - రాజానగరం : ప్రజలు ప్రతిఒక్కరు సుఖసంతోషాలతో మెలగాలని దీక్షలు చేపట్టి ప్రజాశ్రేయస్సుకై రామనామం జపిస్తూ రధోత్సవ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వాసుదేవ గురుస్వామి అన్నారు. కాకినాడ జిల్లాలోని అచ్చంపేట నుండి భద్రాచలం వరకు సుమారు 280 కిలోమీటర్లు దూరం చేపట్టిన పాదయాత్ర ఆదివారంనికి రాజానగరం చేరుకుంది. దింతో గ్రామానికి చెందిన పలువురు భక్తులు కామిరెడ్డి వెంకటేశ్వరరావు, కుమార్తె నాగలక్ష్మి, కనకరాజు, కుర్రె శ్రీనివాస్,కుర్రె నాగబాబు,ముప్పిడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు వసతి కల్పించి రాత్రి వేళ భోజన సదుపాయం కల్పించారు.ఈ సందర్భంగా వాసుదేవ గురుస్వామి మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా,అరిష్టాలు తొలగాలని, పశుపంటలు వృద్ధి చెందాలని కోరుతూ సుమారు రెండు వందల మంది భక్తులతో దాదాపు 280 కిలోమీటర్ల దూరం పది రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 4వ తేదీన ప్రారంభించి 13 వతేదీతో యాత్ర ముగిస్తునట్లు తెలిపారు. దింతో యాత్ర ప్రాంగణమంత శ్రీ రాముని నామస్మరణతో మారుమ్రోగింది. రాజానగరం ప్రజలు భక్తులకు స్వాగతం పలికారు.

హైవేలో పోలీసుల బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్‌లు ధరించి హైవే పైన, జె కొత్తూరు రహదారిలో అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలను వాహనదారులకు వివరించారు.

నవోదయ ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో మ్యాజిక్ హౌస్‌లో శ్యామ్ జాదు గర్ మాయా ఈ బడి ఆధ్వర్యంలో నవోదయ ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ తరగతులను నిర్వాహకుడు శ్యామ్ ప్రారంభించారు. ఆత్రేయపురం, రావులపాలెం మండలాలకు చెందిన వివిధ గ్రామాలకు చెందిన సుమారు 120 మంది స్క్రీనింగ్ పరీక్ష రాయగా అందులోంచి 25 మందిని ఎంపిక చేసామని వీరికి 10 వారాల పాటు పూర్తి స్థాయి ఉచిత శిక్షణ తరగతులను ఇవ్వనున్నట్లు శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, తేజశ్రీ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

నిబద్ధతతో విలువలు పెంచుకోవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : విలేకరులు తమ వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో పాటిస్తూ విలువలు పెంచుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్ష, కార్య దర్శులు అడపా వెంకట్రావు, చింతల రాంబాబులు తెలిపారు. ఆదివారం జగ్గంపేటలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రధానంగా సమావేశంలో పలువురు విలేకరులు నూతనంగా సభ్యత్వాలు స్వీకరించారు. సభ్యుల తీర్మానం మేరకు ప్రతి విలేఖరి బీమా సౌకర్యం పొందటానికి అంగీకరించారు. ఒక విలేఖరి అకాల మరణంపై ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని, ప్రతీ విలేకరి వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి ఇన్సూరెన్స్ వ్యక్తిగత జీవితాలకు అవసరమన్నారు. వృత్తిరీత్యా కొత్తగా చేరిన సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఇటీవల ఒక విలేకరిపై ఓ అధికారి ప్రవర్తనను ఖండించారు. ఆ విలేఖరికి జరిగిన ఘటనపై ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకుల స్పందించిన తీరును ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో విలేకరుల పక్షాన ఏపీయూడబ్ల్యూజే మాత్రమే ప్రత్యక్షంగా బలపరుస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గ స్థాయిలో సుమారు 60 మంది సభ్యత్వాలు తీసుకున్నారు. మరో 10 మంది తమ పనుల రీత్యా బయటకు వెళ్లిన సందర్భంగా సమావేశానికి హాజరు కాలేదు. వారి కోరిక మేరకు సోమవారం సాయంత్రం వరకు సభ్యత్వాల స్వీకరణ గడువు పెంచారు. సమావేశంలో ప్రతీ విలేఖరికి విలువలతో కూడిన జర్నలిజం పట్ల అవగాహన పెంచుకోవాల్సిందిగా కోరడమైనది. ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు అడపా శ్రీనివాస్, కిర్లంపూడి, గోకవరం, జగ్గంపేట, గండేపల్లి మండలాల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులారా ఇంజనీర్లు, బిల్డర్ల చేతిలో మోసపోకుండా మేల్కొండి

-యూనియన్ నిర్దేశించిన రేట్లకే పనులు చేయండి
-ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడలో వీర్ కమల్ థియేటర్ వద్ద ఆదివారం ది. కాకినాడ ఏరియా బిల్డింగ్ వర్కర్ యూనియన్ నెలవారి సమావేశం ఏఐటీయూసీ నగర కార్యదర్శి టీ. అన్నవరం అధ్యక్ష తన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు మేలుకోవాలని, ఇంజనీర్స్ అండ్ బిల్డర్స్ చేతిలో మోసపోవద్దని, యూనియన్‌లో నిర్దేశించిన రేట్లకే పనులు ప్రారంభించాలని, ప్రతి పనిలో అగ్రిమెంట్లు చేయించుకోవాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. బిల్డింగ్ నిర్మాణంలో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ ప్రమాదానికి బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ బాధ్యత లేదని అగ్రిమెంట్లో రాయించుకుంటున్నారని, దానిని భవన నిర్మాణ కార్మికులు వ్యతిరేకించాలని ప్రసాద్ అన్నారు. ఆంధ్ర భవన నిర్మాణ కార్మికులపై బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ కాంట్రాక్టర్లకు మోజు తగ్గిందని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన హిందీ వారిపై మోజు ఎక్కువ అవుతుందని, దాని కారణంగా స్థానికంగా ఉండే భవన నిర్మాణ కార్మికులకు ప్రాధాన్యత తగ్గిస్తున్నారని సహించేది లేదని యూనియన్ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. స్థానికంగా ఉండే భవన నిర్మాణ కార్మిక సంఘాలన్నీ ఏకమై ఆ పద్ధతిని ఏ కార్యాలయంలో జరిగిన దానిని ఎండగట్టాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వల్ల భవన నిర్మాణ కార్మికుల ధరలు తగ్గుతున్నాయని, ఒకపక్క నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న, నిర్మాణరంగంలో ముడి సరుకుల ధరలు పెరుగు తున్న, కూలి రేట్లు పెంచకుండా ఇంకా కూలి రేట్లు తగ్గించాలని, కార్మికు లను చులకన భాగంగా చూస్తున్నారని ఆయన అన్నారు. నిర్మాణరంగంలో బిల్డర్స్, ఇంజనీర్స్, ప్రసిద్ధిగాంచిన షాపులలో యాజమాన్యాలు సైతం కోట్లాది రూపాయలతో బిజినెస్‌లు చేస్తున్న కార్మికులకు గిట్టుబాటు ధర కల్పించడంలో మొండి చేయి చూపిస్తున్నారని, ఇప్పటికైనా కార్మికులందరూ ఏకం కావాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యేసు, అచ్చురాజు, పాలంకి వెంకటేశ్వరరావు, పిల్లి సతీష్, చంద్రశేఖర్, రవి, చందు, కాశి, సోమరాజ్, సూర్య ప్రకాష్, పంపన బోయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాలమ్మ విగ్రహ ప్రతిష్ట చేసిన కన్నబాబు

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉప్పాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టను ఆదివారం కాకినాడ రూరల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రారంభించారు. ఉప్పలమ్మ అమ్మవారి మహెూత్సవం సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. పదివేల మందికి మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేయగా కన్నబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉప్పలమ్మ అమ్మవారి మహెూత్సవం, అంగరంగ వైభవంగా జరగడం చాలా సంతోషమని కన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ వంగ గీతా విశ్వనాథ మాట్లాడుతూ ప్రభుత్వం హిందూ ముస్లిం క్రిస్టియన్ బేధం లేకుండా అన్ని దేవాలయాలకు నిధులు మంజూరు చేసి సాంప్రదాయాలను ఇనుమడింప చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకె శ్రీ లక్ష్మీ సత్తిబాబు, జెడ్పీటీసీ వై.సుబ్బారావు, వేద పండితులు, ఉపాసకులు బ్రహ్మశ్రీ లోకనాథ శర్మ, కురసాల సత్యనారాయణ, సినీ డైరెక్టర్ కళ్యాణ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ యాదవ్ టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక కోనేటి వీధి వద్ద గల నూకాలమ్మ తల్లి ఆలయం వద్ద వైసీపీ యువనేత జగ్గంపేట శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు వైభోగుల శ్రీనివాస్ యాదవ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ముందుగా వారి కుల దైవం శ్రీకృష్ణుడికి పూలమాలవేసి దర్శనం చేసుకున్నారు. అనంతరం టిడిపిలో చేరిన వారందరికీ జ్యోతుల నెహ్రూ జ్యోతుల నవీన్‌లు టిడిపి కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. వైబోగుల శ్రీనివాస్ యాదవ్ నాయకత్వంలో ఈగల వీరబాబు, సప్ప సత్య ప్రసాద్, సుంకర సత్తిబాబు కిలాడి తిరుపతిరావు, చలికి బాబి తదితరుల ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాల యాదవ కులస్తులు టిడిపిలో చేరారు.

ఫ్రెండ్లీ మ్యాచ్‌లో ఎస్పీ లెవెన్ పై కలెక్టర్ లెవెన్ విజయం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : ఆదివారం ఉదయం జీ ఎస్ ఎల్ మైదానంలో కలెక్టర్ వెర్సెస్ ఎస్పీ టీమ్ ల మధ్య ఫ్రెండ్లీ 20 - 20 పోటీ సందర్భంగా టాస్ లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీ లత మాట్లాడుతూ, కొత్త జిల్లా ఏర్పడి దాదాపు ఏడాది పూర్తి కావస్తున్నదన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో అధికారులు మంచి టీమ్ వర్క్ తో కలిసి అడుగులు వేస్తున్నారని అన్నారు. గత ఏడాది కాలంలో ఎన్నో కార్యక్రమాలను టీమ్ వర్క్‌గా విజయవంతంగా చేపట్టి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని అన్నారు. ఒత్తిడిని అధిగమించేం దుకు ఇటువంటి స్నేహపూర్వక వాతావరణం లో క్రీడల నిర్వహణ కూడా ఎంతో దోహదం చేస్తాయని అంటూ కలెక్టర్ మాధవీలత ఇరు టీమ్ లకు "ఆల్ ది బెస్ట్" చెప్పారు. అనంతరం జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఇరు బృందాలకు ఆల్ ది బెస్ట్ చెప్పడం జరిగింది. ఇటువంటి స్నేహ పూర్వక మ్యాచ్ ఏర్పాటు చేసిన కలెక్టర్‌ను ఎస్పీ అభినందించారు. మ్యాచ్ అనంతరం జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ విజేత లైన కలెక్టర్ 11 టీమ్ కు విన్నర్ ప్రైజ్ ట్రోఫీ,, రన్నర్ అప్ టీమ్ ఎస్పీ 11 టీమ్ కు రన్నార్ అప్ ట్రోఫీ అందచేశారు. పోటీ నిర్వహణ సజావుగా సాగడానికి సహకరించిన జీ ఎస్ ఎల్ యాజమాన్యం చైర్మన్ డాక్టర్ గన్నీ భాస్కర్ రావు, వారి బృందానికి ధన్యవాదాలు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ ఎస్పీ వెర్సెస్ కలెక్టర్ టీమ్ లోని సభ్యులు పట్టుదలతో మ్యాచ్ ఆడటం జరిగిందని, ఇటువంటి క్రీడల్లో గెలుపు మనందరిది అని అన్నారు. మ్యాచ్ నిర్వహణ కోసం పని చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. తొలుత టాస్ గెలిచిన కలెక్టర్ మాధవీలత బౌలింగ్ ఎంచుకుని, ఎస్పీ టీమ్ ను బ్యాంటిగ్ కు ఆహ్వానించడం జరిగింది. ఎస్పీ సుధీర్ కుమార్ నేతృత్వంలోని ఎస్పీ 11 టీమ్ నిర్ణీత 20 లకు 19.1 ఓవర్ల లో 97 పరుగులు చేసి ఆలౌట్ అవ్వడం జరిగింది. అనంతరం బ్యాటింగ్ దిగిన కె. దినేష్ కుమార్ ఐ ఎ ఎస్ నేతృత్వం లోని కలెక్టర్ 11 టీమ్ 11.3 ఓవర్ల లో కేవలం రెండు వికెట్లు కోల్పోయి 101 లను సాధించడం ద్వారా 4 పరుగులు, 8 వికెట్ల తేడాతో విజయం సాధించారు. కలెక్టర్ టీమ్ కు కెప్టెన్‌గా వ్యవహరించిన మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ 31 పరుగులు సాధించి బెస్ట్ బ్యాట్స్ మ్యాన్ అవార్డు ను ఎస్పీ చేతుల మీదుగా గెలుచుకున్నారు. విజేత ట్రోఫీని ఎస్పీ, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా కలెక్టర్ 11 టీమ్ దినేష్ కుమార్ నేతృత్వంలోని సభ్యులు తీసుకున్నారు. ప్రతి ఒక్క క్రీడాకారులకు విన్నర్, రన్నర్ మెమెంటోలను బహూకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి జీ. నరసింహులు, ఆర్డీవో ఏ. చైత్రవర్షిని, ఎస్. మల్లి బాబు, జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు ఎం ఎం శేష గిరి టీమ్, తహశీల్దార్లు, ఇతర అధికారులు, జిఎస్‌ఎల్ సిబ్బంది సహకారం తో నిర్వహించారు.

విద్యుత్ సబ్సిడీపై ఆక్వా రైతుల పోరుబాట

విశాలాంధ్ర-అమలాపురం : డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆక్వా రైతులు పోరుబాటకు సిద్ధపడుతున్నారు ఆదివారం అమలా పురం క్షత్రియ కళ్యాణ మండపంలో సమావేశమైన కోనసీమ ఆక్వా రైతులు.. విద్యుత్ సబ్సిడీ ఎత్తివేయడంతో ఆందోళనకు సిద్ధమయ్యారు. ఆక్వా జోన్లో ఉండి కూడా ఈఫిష్ సర్వే కారణంగా నూటికి 70% మంది సబ్సిడీ కోల్పోతున్నారు అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు తరలి రావాలని పిలుపునిచ్చిన కోనసీమ ఆక్వా రైతు నాయకులు నానిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి త్సవటపల్లి నాగభూషణం, అల్లూరు రమేష్ రాజు, సూరిబాబు రాజు, దెందుకూరి సత్తిబాబు రాజు, కాశీ రాజు తోపాటు వివిధ గ్రామాల నుండి ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే

విశాలాంధ్ర - సీతానగరం : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే. మండలంలో గల 21 గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ అరకొరగా సాగుతోంది అనడంలో అతిశయోక్తి లేదు. గ్రామాల్లో కనీవినీ ఎరుగని రీతిలో దోమలు ఉన్నాయని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ పంచాయతీలో దోమలు పై దండ యాత్ర అంటూ దోమలు నివారణకు మందును పిచికారి చేసే వారు కానీ ఇప్పుడు అటువంటి కార్యక్రమాలే కాకుండా పారిశుధ్య నిర్వహణ కూడా అరకొరగా చేసున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022-23లో మండలంలో వివిధ గ్రామాల్లో అత్యధికంగా డెంగీ కేసులు నమోదయ్యాయి అంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాలలో రద్దీగా ఉండే సెంటర్లలో వారానికి ఒక రోజు బ్లీచింగ్ పౌడర్ చల్లే వారు ఇప్పుడు ఆ పరిస్థితి లేదు ఎవరైనా అతిథులు వస్తున్నారు అంటేనే బ్లీచింగ్ వేస్తున్నారు అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ దోమలు, అపరి శుభ్ర ప్రదేశాల వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

7న విద్యుత్ సరఫరా నిలుపుదల

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం పురుషోత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ బి. వీరభద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్‌లో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణ పని నిమిత్తం పురుషోత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల 11 ఫీడర్‌లు అన్నింటికి విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని పురుషోత్తపల్లి, గోపవరం, విజ్జేశ్వరం, అట్లపాడు, పందలపర్రు, డి.ముప్పవరం, రావివారిగూడెం, కలవచర్ల, జీడిగుంట కొరుపల్లి, మునిపల్లి పెండ్యాల, గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా అ ప్రకటనలో వీరభద్రరావు కోరారు.

విశాలాంధ్ర డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : నూతనంగా ఏర్పడిన తూర్పు గోదావరి జిల్లాలో విశాలాంధ్ర డైరీని జిల్లా సీపీఐ కార్యదర్శి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్క రించారు. రాజమండ్రి పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యులు, విశాలాంధ్ర జిల్లా రిపోర్టర్స్ మధ్య ఆవిష్కరించారు. మధు మాట్లాడుతూ ప్రతి ఏడాది క్యాలెండర్ కొత్త కొత్త మార్పులు చెందుతూ ఆకర్షణీయంగా ఉంటోందన్నారు. పత్రికకు ఆదరణ పెరుగుతూనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర తూర్పుగోదావరి స్టాఫ్ రిపోర్టర్ ఎల్. బలరామ్, యాడ్ ఇన్‌చార్జి మల్లేశ్వరరావు, వసంతరాజు, కుండ్రపు రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి, వి. కొండలరావు నగర కార్యదర్శి, చింతలపూడి సునీల్, జిల్లా కార్య వర్గ సభ్యులు ఎమ్మెన్ రాజు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకోసం యూటీఎఫ్ సంకల్పదీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : సీపీఎస్ రద్దుకోరుతూ కృష్ణాజిల్లా గన్నవరంలో చేపట్టిన సంకల్పసభను రాష్ట్రప్రభుత్వం నిరంకుశంగా భగ్నం చేసింది. దీనికి నిరసనగా యూటీఎఫ్ రాష్ట్రసంఘం పిలుపుమేరకు అన్నిజిల్లా కేంద్రాల్లో సంకల్పదీక్షలు నిర్వహించారు. కాకినాడలో ధర్నాచౌక్‌వద్ద యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సంకల్పదీక్షను రాష్ట్ర ఆడిట్‌కమిటీ కన్వీనర్ కె. సత్తిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన వారంలోగా సీపీఎస్ రద్దుచేస్తామని హామీనిచ్చి మాట తప్పిందని, సీపీఎస్ రద్దు మినహా ప్రత్యామ్నాయానికి అంగీకరించమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి రవిచక్రవర్తి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో జీపీఎస్ ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోందని, దీన్ని విరమించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. యూటిఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే 5రాష్ట్రాలు సీపీఎస్ రద్దుచేసి పాతపెన్షన్ అమలు చేస్తున్నారని, అదేవిధంగా ఇక్కడ అమలుచేయాలని డిమాండ్‌చేశారు. దీక్షలో జిల్లా సహాధ్యక్షుడు ఐ ప్రసాదరావు, కోశాధికారి గణేశ్వరరావు, సహాధ్యక్షురాలు బి నాగమణి, జిల్లా కార్యదర్శులు ఎంవి సాయిరాం, ఎస్ వీరబాబు, సూరిబాబు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు సంకల్ప దీక్ష

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యూటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వ ర రావు అధ్యక్షతన సీపీఎస్ రద్దు కొరకు సంకల్ప దీక్ష జిల్లా కలక్టరేట్ కార్యాలయం వద్ద జరిగింది. సుమారు 300 మంది సీపీఎస్ ఉపాధ్యాయులో ఈ సంకల్ప దీక్షలో పాల్గొన్నారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వర రావు (ఐవి) మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచన మార్చుకుని పాత పెన్షన్ విధానాన్నిపు నరుద్ధరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేని పక్షంలో ఇలాంటి అనేక పోరాటాలు అనేకం చేపడతామని తెలిపారు. నాడు పాదయాత్రలో తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని వైఎస్ జగన్ హామీఇచ్చాడని, అధికారంలోకి వచ్చి 4 ఏళ్ళు గడిచినా ఇంతవరకు సీపీఎస్ రద్దు చేసింది లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని యూటీఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సంకల్ప దీక్షలో యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డివి రాఘవులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, సహాధ్యక్షులు పి సురేంద్ర కుమార్, ట్రెజరర్ కె పరీక్షకు టర్, జిల్లా కార్య నిర్మలు జీవి రమణ, పి మురుగేశ్వరరావు, సీహెచ్ కేశవరావు, బిఎం అనిల్ కుమార్, అర్ శ్రీనివాస్, ఎ కాశి విశ్వేశ్వరరావు, వైవి జెఎస్ బావాణి, ఆసిడ్బ్వీ కన్వీనర్ శ్రీనివాసరావు మరియు అధిక సంఖ్యలో యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైసీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీ నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రావులపాలెం మండలం గోపాలపురంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన కరాటి గణపతి, సజ్జా సాయిరామ్, గండ్రోతు వాసు, తోట దుర్గారావు, ఏపుగంటి గణపతి, ఏపుగంటి వెంకటేష్, ఏపుగంటి మూర్తి, జనిపిరెడ్డి అశోక్, జనిపిరెడ్డి మణికంఠ, శ్రీఘాకొల్లపు శ్రీహరి, రాచకొండ వాసు, తోట ధనరాజు, తొండూరి అమ్మన్న, దంగేటి బాబీ, కుంపట్ల మణి తదితరులు వైసీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

దొమ్మేరులో ఇదేం కర్మ

విశాలాంధ్ర-కొవ్వూరు: కొవ్వూరు నియోజక వర్గం, కొవ్వూరు మండలం దొమ్మేరు ,దొమ్మేరు సావరం గ్రామంలో ఇదేం కర్మ కార్య క్రమం నిర్వహించారు. కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి కంటమణి రామకృష్ణ కొవ్వూరు మండల అధ్యక్షులు వట్టికుట్టి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కలగర సుబ్బారావు, యలమర్తి రాంబాబు టిడిపి నాయకులు కెవిపి రంగారావు బండ్రెడ్డి నాగేశ్వరరావు, బెల్లపుకొండ శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షులు కుక్కిరిపాటి శ్రీహరి నాయకులు పాల్గొన్నారు.

ఎక్కడా లేని పెట్రో ధరలు ఇదేం కర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై అధిక పన్ను విధిస్తూ ధరల పెరుగుదలకు కారణం అవుతుందని సత్యానందరావు అన్నారు. కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పార్టీ నేతలతో కలిసి సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రాష్ట్రాలు ఇప్పటికే ఇంధనంపై అమ్మకం పన్ను తగ్గించగా మన రాష్ట్రంలో ఒక్క పైసా కూడా తగ్గించకుండా ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తుంది అన్నారు. గతంలో సైకిల్ పై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు నేడు చిన్న చిన్న మోటార్ సైకిళ్ళపై వ్యాపారాలు సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారని పెట్రో బాదుడు కారణంగా వీరి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. ప్రజా సంక్షేమం పట్టని ఈ ప్రభుత్వ వైఖరితో రాష్ట్రానికి ఇదేం కర్మ అంటూ ప్రజలు వాపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, చిలువూరి సతీష్ రాజు, గెద్దం సుధ, కాయల కాయల జగన్నాథం, కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరావు, కట్ట లక్ష్మీ, తోట రజని, చిటికెన సత్యనారాయణ మరియు క్లస్టర్ ఇన్‌చార్జిలు బూత్ కన్వీనర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.